## క్లుప్తంగా

### సుజ్ఞానరత్నం సేవలు మరువలేనివి



సుజ్ఞానరత్నం దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, నేతలు, హెచ్ఎం తదితరులు

కొయ్యూరు: ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన సాసుం సుజ్ఞానరత్నం సేవలు మరువలేనివని ఎంపీపీ బడుగు రమేష్ బాబు అన్నారు. రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్న సుజ్ఞానరత్నం ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. సుజ్ఞానరత్నం, సన్యాసిరావు దంపతులను ఆయన సన్మానించారు. ఆదివాసీ జేఏసీ నేత మొట్టడం రాజుబాబు, అనేక పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్ పీటా సింహాచలం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### ఆదివాసీ సంప్రదాయాలను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

చింతూరు: ఆదివాసీల తెగలు పూజించే వన దేవతలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి కోరారు. మండలంలోని రత్నాపురంలో శుక్రవారం జరిగిన పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీ భూములకు ప్రభుత్వమే రెవెన్యూ పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి గుర్తింపు కల్పించాలన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని, ఆదిమ తెగల పూజారులకు రూ 10 వేలు గౌరవ వేతనం చెల్లించాలని ఆయన కోరారు. పొడియం లక్ష్మణరావు, రామారావు, సుబ్బారావు, అప్పారావు పాల్గొన్నారు.

### అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహేష్, ఆలయ కమిటీ సభ్యులు

కొయ్యూరు: ఈనెల 20 నుంచి 23 వరకు ఎర్రగొండమ్మ ఉత్సవాలను నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది.ఈ మేరకు కమిటీ అధ్యక్షులు గొడ్డేడి మహేష్ ఆధ్వర్యంలో జాతర పోస్టర్‌ను శుక్రవారం ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. శరభన్నపాలెం సర్పంచ్ కిముడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దారకొండ నారాయణమూర్తి, పనసల రాము, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యసనాలకు దూరంగా ఉండాలి



గొందోలులో యువతతో మాట్లాడుతున్న ఎస్ఐ వినోద్ తదితరులు

అడ్డతీగల: మండలంలోని గొందోలులో ఎస్ఐ వినోద్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

గంజాయి కలిగి ఉన్నా రవాణా చేసినా పండించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోక్సో చట్టంపై కనీస అవగాహన ఉండాలన్నారు. బాల్య వివాహాల చట్ట విరుద్ధమని, ఎక్కడైన జరిగితే తమకు సమాచారం అందించాలని సూచించారు. యువత ఉన్నత చదువులు అభ్యసించి, తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.


### అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మునగపాక : ఒడిశా నుంచి అక్రమంగా బీర్ బాటిళ్లను తీసుకువెళుతున్న వ్యక్తిని అరెస్టు చేసి కారును సీజ్ చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాద రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం రాత్రి ఎస్ఐ ప్రసాదరావు నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. కాకినాడకు చెందిన వ్యక్తి ఒడిశా రాష్ట్రం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా 105 టిన్‌బీర్లను రవాణా చేస్తుండడంతో గుర్తించి అతనిని అరెస్టు చేశారు. బీర్ బాటిళ్లను తరలిస్తున్న కారును సీజ్ చేసినట్టు తెలిపారు.

# ఆశాజనకంగా వ్యాపారం



సంతలో పనసకాయల విక్రయాలు




ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో పనస కాయల వ్యాపారం భారీగా జరుగుతుంది. ఒడిశాలో పనసకాయలకు గిరాకీ నెలకొన్న నేపథ్యంలో వ్యాపారులు గ్రామాల్లోకి వెళ్లి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రామాల నుంచి వ్యాన్లు, లారీల్లో పనసకాయలను తరలిస్తున్నారు. వారపు సంతల్లో ఈ సారి కిలో పనసకాయల ధర ఎన్నడూ లేని విధంగా మొదట్లో కిలో రూ.15 నుంచి రూ.25 వరకు ధర పలికింది. ప్రస్తుతం కిలో రూ.35 వరకు విక్రయిస్తున్నారు. వర్షాలు మొదలైతే పనస కాయలు పాడైపోతాయి అనే ఉద్దేశంతో ముందుగానే కాయలను చెట్టు నుంచి కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. పనసలో రెండు రకాలు ఉంటాయి.అందులో ఖర్జూరం రకం కాయలను పండ్లుగా విక్రయించేందుకు చెట్లకే ఉంచేశారు. ముదురితే పనికి రాని గుజ్జు రకం పనసకాయలను మార్కెట్‌కు సరఫరా చేస్తున్నారు.

ప్రధానంగా ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాల నుంచి ఒడిశాలోని జయపురం మార్కెట్‌కు ప్రతి రోజు 100 టన్నుల వరకు పనసకాయలను వ్యాపారులు తరలిస్తున్నారు. జయపురం మార్కెట్ నుంచి కటక్, కోల్‌కతా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మన్యంలో సైతం గత మూడేళ్ల కాలంలో ఈ ఏడాది పనస చెట్లన్నీ పనసకాయలు పదుల సంఖ్యలో విరగ్గాసాయి. ఒడిశాలో బరంపురం,జయపురం, గుజరాత్, కోల్‌కతా ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లలో పనసకాయల వినియోగం ఎక్కువ. ముఖ్యంగా పచ్చళ్లకు, పకోడీలు, ముక్కలతో బిర్యానీ, పొట్టు కూర, గూనచారు, కుర్మా, ఇడ్లీ, బూరెలు, చిప్స్ వంటి ఆహర పదార్థాల్లో అధికంగా వాడుతారు.



వ్యాన్‌లో ఒడిశాకు తరలిస్తున్న పనసకాయలు



వ్యాపారులు కొనుగోలు చేసిన పనసకాయలు

#### గిట్టుబాటు ధరలు

గ్రామాల్లోకి ఒడిశా నుంచి వచ్చి వ్యాపారులు పనసకాయలను కొనుగోలు చేస్తున్నారు. పనసకాయ సైజ్‌ను బట్టి రూ.15 నుంచి రూ.30 వరకు కొంటున్నారు. గత కొన్ని నెలలుగా పనసకాయల సేకరణలో గ్రామస్తులు నిమగ్నమై ఉన్నారు. గ్రామంతో పాటు కొండ ప్రాంతాలకు వెళ్లి పనసకాయలను తీసుకొని వచ్చి నిల్వ చేస్తున్నాం. ఒడిశా వ్యాపారులు వచ్చిన వెంటనే అమ్ముతున్నాం. ప్రస్తుతం గిట్టుబాటు ధరలు ఉన్నాయి. వ్యాపారం బాగుంది. ..కె.గోపాల్...
సింధిపుట్టు గ్రామం...ముంచంగిపుట్టు మండలం

#### డిమాండ్ ఉంది

పనసకాయలకు ఒడిశాలో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం పెళ్లిళ్ల, హోటల్స్‌లో పనసకాయ బిర్యానీకి, పచ్చళ్లకు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో పనసకాయ సేకరణకు ఏవోబీలోని గిరిజన గ్రామాల్లో ఇంటి వద్దకే వెళ్లే పనస కాయలు కొనుగోలు చేస్తున్నాం. జనవరి నెల నుంచి మే నెల వరకు పనసకాయలు కొనుగోలు చేసి, ఒడిశాకు తరలిస్తున్నాం. గుజ్జు రకం పనసకాయలనే అధికంగా కొనుగోలు చేస్తాం.
– గురునాథ్ హంతాల, పనసకాయల వ్యాపారి,
పాడువ గ్రామం, కొరాపుట్టు జిల్లా, ఒడిశా రాష్ట్రం

## న్యాయం చేయాలని నిర్వాసితుల వినతి



రింతాడలో జాతీయ రహదారి రింగ్‌రోడ్డు కారణంగా తొలగించనున్న ఇళ్లు

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండలం చాపరాతిపాలెం రింతాడ మీదుగా 516ఈ జాతీయ రహదారి నిర్మాణం కారణంగా భూములు, దుకాణాలు, ఇళ్ల కోల్పోతున్న బాధిత నిర్వాసితులకు ప్రభుత్వం, జాతీయ రహదారి విభాగం అధికారులు తగిన నష్టపరిహారం అందించాలని రింతాడ గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరుతున్నారు. రింతాడ కూడలిలో కొందరు గిరిజన నిరుద్యోగ యువకులు దుకాణాలను నిర్మించుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. 516ఈ జాతీయ రహదారి నిర్మాణం కారణంగా రింతాడ కూడలిలో గూడెంకొత్తవీధి మీదుగా సీలేరు వెళ్లే మార్గంలో కొందరి గిరిజన యువకులకు దుకాణాలున్నాయి. రింగ్‌రోడ్డు కారణంగా వీటిని తొలగించాలని జాతీయ రహదారి నిర్మాణ విభాగం అధికారులు నోటీసులు ఇచ్చారు. తాము దుకాణాలను తొలగించేందుకు ఎటువంటి అభ్యంతరం చెప్పడం లేదని దుకాణాల నిర్మాణానికి తాము ఖర్చుచేసిన వ్యయాన్ని అంచనా వేసి తగిన విధంగా తమకు నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు. రింతాడ కూడలిలో ఓ గిరిజన యువకుడు సుమారు రూ.3లక్షలు వెచ్చించి ఫొటో స్టూడియో నిర్మించుకున్నారు. దాని ద్వారా ఉపాధి పొందుతున్నాడు. ఇతనికి నష్ట పరిహారంగా అతితక్కువ పరిహారం మంజూరుకు నిర్ణయించారు. దీని వల్ల తాము అన్ని విధాలుగా నష్టపోతామని ఉపాధి కోల్పోగా తగిన పరిహారం అందకపోతే తాము ఎలా బతకాలని ఈ విషయంలో తగిన న్యాయం చేయాలని బాధిత గిరిజన యువకుడు కలెక్టర్‌ను వేడుకుంటున్నాడు. చిన్న చిన్న బడ్డీలను ఏర్పాటు చేసుకున్న గిరిజనేతరులకు వచ్చిన నష్ట పరిహారం కూడా గిరిజనులమైన తమకు రావడం లేదని ఈ విషయంలో పక్షపాతం లేకుండా జాతీయ రహదారి విభాగం అధికారులు వ్యవహరించాలని తమకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వలసలు ప్రోత్సహించే చర్యలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నేతలు

అడ్డతీగల: టూరిజం పేరిట వలసలు ప్రోత్సహించే చర్యలు మానుకోవాలని ఆదివాసీ సంఘాల కూటమి నేతలు డిమాండ్ చేశారు.అడ్డతీగలలోని ఆదివాసీ భవనంలో వివిధ ఆదివాసీ సంఘాల నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. ఐదవ షెడ్యూల్‌లోని ఏరియా అయిన ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పేరిట టూరిజాన్ని అడ్డం పెట్టుకుని 1/70 చట్టాన్ని సవరణ చేసే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఆదివాసీ చైతన్య వేదిక సంఘం అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు లోతా రామారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు అన్నారు. టూరిజం వల్ల గిరిజనేతరుల వలసలు పెరుగుతాయన్నారు. 1/70 చట్టం నిర్వీర్యమై ఏజెన్సీ చట్టాలు, హక్కులకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. టూరిజం వల్ల ఆదివాసీల బతుకులు మారవన్నారు.ఆదివాసీలు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ట్రైకార్ రుణాల ద్వారా రూ.5లక్షలు వ్యక్తిగత రుణాలు రాయితీతో ఇవ్వాలన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ప్రత్యేక చట్టాలు చేసి నూరుశాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. రైతులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి ఆర్థిక భారాన్ని తగ్గించి వారు పండించే పంటలకు గిట్టుభాటు ధర కల్పించి దళారీ వ్యవస్థను నిషేధించాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్నారు. నాణ్యమైన విద్యను ఆదివాసీలకు అందించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు ఏజెన్సీలో జరగకుండా అధికారులు నిజాయితీగా పనిచేసేలా చూడాలన్నారు. పలువురు ఆదివాసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## కారం రాజులు మృతి పార్టీకి తీరనిలోటు



రాజులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకుడు చినబాబు



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకుడు నరసింహారావు

వి.ఆర్.పురం: సీనియర్ నాయకుడు కారం రాజులు మృతి పార్టీకి తీరనిలోటు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సోయం చినబాబు అన్నారు. రాజులు మృతదేహాన్ని ఆయన సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ కారం లక్ష్మీ, నేతలు సంతోష్, శ్రీరామ్మూర్తి, సుందరయ్య తదితరులున్నారు.

**మృతుల కుటుంబాలకు పరామర్శ**

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు ,సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి రాంబాబు శుక్రవారం రేఖపల్లి గ్రామంలో మృతి చెందిన నాయకులు పి.సత్యనారాయణ, చిన్నమట్టపల్లిలో కారం శిరమయ్, సున్నవారిగూడెంలో సున్నం రాజయ్య తదితరుల కుటుంబాలను కలిసి పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు, రాజులు, నాగేశ్వరావు, సీతారామయ్య తదితరులున్నారు

## 30న మల్లమ్మతల్లి జాతర

దుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో మల్లమ్మతల్లి గృహ జాతరను మహోత్సవాలను ఈనెల 30న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో ఉన్న మల్లమ్మతల్లి జాతర పూజ కార్యక్రమాలను బుధవారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు.అదే రాత్రి 9 గంటల నుంచి ఒడియా భగవతం ప్రదర్శన ఉంటుందని, దీంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రోజూ ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ మేరకు ఇరు రాష్ట్రాల సరిహద్దు గిరిజన భక్తులు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## 23న మండల సమావేశం

రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10.30గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. అధికారులతో సమీక్షా సమావేశం ఉందని, వారి వద్ద గల పూర్తి రికార్డులను 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోగా కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

## మైనార్టీ హక్కులను కాపాడుకోవాలి

వి.ఆర్.పురం: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్టు మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి పులి సంతోష్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విధానాలు రాజ్యాంగంపై మైనారిటీ హక్కులపై దాడి చేస్తున్నారని దేశ లౌకిక కూర్పుని దెబ్బతీస్తు మతపరంగా చీలికలను పెంచుతున్నారని ఈ చట్ట సవరణను సీపీఎం వ్యతిరేకిస్తుందన్నారు. మైనార్టీ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీఆర్ పురం మండల కేంద్రంలోని మసీదు వద్ద ముస్లిం సోదరలను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సన్మానం



కార్యదర్శి శివమణికంఠను సన్మానిస్తున్న సిబ్బంది

కూనవరం: చినార్కూరు పంచాయతీ కార్యదర్శి గుమ్మడి శివ మణికంఠం గత మూడేళ్ల చినార్కూరు పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ సున్నం అభిరాం, ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్ అన్నారు. పదోన్నతిపై ఇక్కడి నుంచి రంగంపేట మండలం ముకుందవరం బదిలీపై వెళ్తున్న ఆయనకు శుక్రవారం పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బందిని సమన్వయం చేస్తూ శివమణికంఠ పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. వరదల సమయంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత శివ మణికంఠ మాట్లాడుతూ సర్పంచ్ సున్నం అభిరాం, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, స్థానికులు అందించిన అభిమానం మరువలేనిదన్నారు. ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, కూనవరం పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్

వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ టోర్నీని ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్, టీడీపీ నాయకుడు మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వి.ఆర్.పురం, చింతూరు మండలాల క్రికెట్ జట్లు తలబడనున్నాయి. క్రికెట్ టోర్నమెంట్‌కి మొదటి బహుమతిగా మల్లికార్జునరావు రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు జమాల్‌ఖాన్, బెస్ట్ విన్నర్స్ రన్నర్స్ కు రూ.30 వేలతో పాటు మెమొంటోలను నిర్వాహకులు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ రామారావు, నరసింహరావు శంకర్ రావు టోర్నీ నిర్వాహకులు అజయ్ శ్రావణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో కాఫీ పరిశ్రమ ఏర్పాటుచేయాలి




విలేకరులతో మాట్లాడుతున్న పొద్దు బాలదేవ్ తదితరులు

అరకులోయటౌన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆర్గానిక్ కాఫీ సాగు చేస్తున్న ఆదివాసీ ప్రాంతమైన పాడేరు ఏజెన్సీలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేసి, ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేయడమేనన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో ప్రపంచ, ప్రఖ్యాతి గాంచిన ఆర్గానిక్ కాఫీ ఆదివాసీ గిరిజన రైతులు పండిస్తున్నారని, సుమారు లక్ష 30వేల మంది రైతులు 2 లక్షల ఎకరాల్లో 15వేల మెట్రిక్ టన్నుల కాఫీ ఉత్పత్తి చేస్తుంటే, కాఫీ పండించే ఏజెన్సీ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేయకుండా మైదాన ప్రాంతంలో కాఫీ పరిశ్రమ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనం కోసం మైదానం ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తారన్నారు. 2018 నుంచి నేటి వరకు కాఫీ రైతులకు చెల్లించాల్సిన బకాయి సుమారు రూ.60కోట్లు తక్షణమే చెల్లించాలన్నారు. కాఫీ తోటల అభివృద్ధి కోసం ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలని, కాఫీ తోటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చినబాబు, జగన్నాథం, దొబులు పాల్గొన్నారు.

## అమలగుడలో డ్రైనేజీలు నిర్మించాలి



రహదారిని ముంచెత్తిన మురుగునీరు

అరకులోయటౌన్: మండలంలోని గన్నెల పంచాయతీ అమలగుడ గ్రామంలోని పలు వీధుల్లో డ్రైనేజీలు నిర్మించాలని పీసా కమిటి కార్యదర్శి శెట్టి గురుమూర్తి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సుమారు 300 మంది జనాభా నివసిస్తున్నారని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో కొండపై నుంచి వర్షపు నీరు ప్రవహించి ఇళ్లలోకి చేరుతోందని, దీంతో పాటు ప్రధాన రహదారుల్లో నీరు నిలిచిపోతుందన్నారు. గ్రామంలో ఉన్న ఒక్క డ్రైనేజీ కూడా పూడిక తీయడం లేదన్నారు. దీని వలన చెత్త పేరుకుపోయి దుర్గంధంతో గ్రామంలోని గిరిజనులు తరచూ రోగాల బారిన పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అమలగుడలో కాలువల్లో పూడిక తీయాలని, నూతనంగా డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు.

## క్రీస్తు మార్గం అనుసరణీయం



అరకులో శిలువ మోస్తూ ప్రార్థనలు

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- దైవసందేశాన్ని వినిపించిన పాస్టర్లు



జీకె పాడులో క్రీస్తు వేషధారణ

అరకులోయటౌన్: మండలంలో గుడ్ ఫ్రైడే (పవిత్ర శుక్రవారం )ను నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శిలువ యాత్ర జరిపారు. పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. బైబిల్ పఠనం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ మానవాళి కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకొని పవిత్ర శుక్రవారాన్ని జరుపుకుంటారన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. అరకులోయ పట్టణంలోని అరకులోయ, సుంకరమెట్ట, ఎండపల్లివలస చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

దుంబ్రిగుడ: దుంబ్రిగుడ, అరకు, కించుమండ, గుంటసీమ చర్చిల్లో పాస్టర్లు మానషే, జోనష్, బాస్కర్‌రావు, సుదర్శన్ ప్రార్థనలు నిర్వహించారు.

హుకుంపేట: మండల కేంద్రాంలో స్థానిక బేతెస్థ ప్రార్థన మందిరం పాస్టర్ సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో శిలువ యాత్రను నిర్వహించారు.

చింతపల్లి: పలు చర్చిలతోపాటు, సెయింటాన్స్ పాఠశాలలో ప్రార్థనలు చేశారు.

కొయ్యూరు: రాజేంద్రరపాలెం యునైటెడ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

ఎటపాక: మండలంలోని సీతాపురం, గౌరిదేవిపేట, నెల్లిపాక, లక్ష్మీపురం, కృష్ణవరం, జీకె పాడు, రాజుపేట, బాసవాగు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీకే పాడులో మడిపల్లి కొండయ్య క్రీస్తు వేషధారణలో శిలువ యాత్ర ఆకట్టుకుంది.

వి.ఆర్.పురం: స్థానిక ఇవాంజిలికల్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ కె.కృపారావు దైవసందేశాన్ని వినిపించారు.



కొయ్యూరులోని యునైటెడ్ చర్చిలో ప్రార్థనలు



బెంజిపూర్ లూథరన్ చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ సంజీవ్‌కుమార్



వి.ఆర్.పురం చర్చిలో ప్రార్థనలు